సమస్యల కూత!

- నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతుల లేమి
- కూర్చోవడానికి బెంచీలు, తాగడానికి నీరు లేక అవస్థలు
- మరుగుదొడ్లు సైతం లేక ప్రయాణికుల పాట్లు



స్టేషన్‌లో నిరుపయోగంగా తాగునీటి కుళాయి



రక్షణ లేని 2వ ప్లాట్ ఫారంలో ఓ భాగం

ఎస్.రాయవరం: మండలంలో ఉన్న నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో సమస్యలు కూత పెడుతున్నాయి. కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కూర్చోవడానికి బెంచీలు, తాగడానికి నీరు దొరకని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితిలో వెళ్లడానికి మరుగుదొడ్ల సదుపాయం లేక ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ స్టేషన్‌లో నిత్యం సూపర్‌ఫాస్ట్ రైలు గోదావరి, 5 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయి. స్టేషన్‌కు రెండు ఫ్లాట్ ఫారాలు ఉన్నాయి. ఫాట్‌ఫారం–2లో కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. రైలు కోసం నిరీక్షించే సమయంలో ప్రయాణికులు కూర్చోడానికి అవసరమయిన బెంచీలు కూడా లేవు. ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ ఫ్లాట్ ఫారంపై నిల్చుని రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి స్టేషన్‌కు వెళ్లే మార్గంలో కూడా తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. ఈ స్టేషన్ మీదుగా ప్రధానంగా ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాలకు చెందిన ప్రయాణికులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అప్పుడప్పుడు నర్సీపట్నం, మాకవరపాలెం మండలాలకు చెందిన ప్రయాణికులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిటిష్ పాలన నుంచి ఉన్న ఈ స్టేషన్ సదుపాయాల కల్పనకు మాత్రం నోచుకోలేదు. జన్మభూమి, ఈస్ట్‌కోస్టు, రత్నాచల్ వంటి ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నా రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. మరోవైపు రిజర్వేషన్ కౌంటర్‌ను కూడా తొలగించింది. ఏడాదికేడాదికి ఈ స్టేషన్ నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా వసతుల కల్పనపై అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రధాన రైల్వే స్టేషన్‌కు కనీస వసతులు తోడైతే అన్ని వర్గాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



బెంచీలు లేక చెట్టు కింద కూర్చున్న ప్రయాణికులు

రైల్వే అధికారుల చిన్న చూపు



నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నప్పటికి రైల్వే అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. కొత్తగా సదుపాయాలు కల్పించాల్సింది పోయి ఉన్నవాటిని నిర్వీర్యం చేస్తున్నారు. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నారు. రైల్వే స్టేషన్‌లో మరిన్ని సదుపాయాలు పెంచాలి. కొత్త రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి.

– ఎం.శ్రీనివాసరావు, రైల్వే ప్రయాణికుడు, చినగుమ్ములూరు

హోం మంత్రి ఉన్నా ఫలితం శూన్యం



నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో అప్పట్లో పాయకరావుపేట ఎమ్మెల్యే కాకర నూకరాజు చొరవ తీసుకుని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇచ్చి ప్రయాణికులకు ప్రయోజనం కల్పించారు. ఇప్పుడు పాయకరావుపేట ఎమ్మెల్యే, రాష్ట్ర హోంమంత్రి అనిత ఈ స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో నివాసం ఉంటున్నారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. ప్రయాణికులు డిమాండ్ చేస్తున్న జన్మభూమి, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సదుపాయం కల్పించాలి.

– చోడిపల్లి అప్పన్న, రైల్వే ప్రయాణికుడు, రేవుపోలవరం

పూడిమడక రోడ్డులో నిత్యం ట్రాఫిక్ కష్టాలు



పూడిమడక రోడ్డులో నిలిచిన వాహనాలు

మునగపాక: మునగపాక వద్ద పూడిమడక రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. వందలాది వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు అచ్యుతాపురంలోని బ్రాండెక్స్ కంపెనీకి సైతం పలు బస్సులు ప్రయాణం సాగిస్తున్నాయి. అయితే మునగపాకలో కృష్ణంరాజు కాలువపై ఉన్న ఇరుకు బ్రిడ్జి కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అత్యవసర పనులపై ప్రయాణం సాగించేవారికి కష్టాలు తప్పడం లేదు. గురువారం పూడిమడక రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు కలుగజేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. గత నెల రోజులుగా నిత్యం ఏదో సమయంలో పూడిమడక రోడ్డులో వాహనాలు నిలిచిపోవడం జరుగుతోంది. సమస్య పరిష్కారంపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

మల్లవరంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని మల్లవరంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరగనుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

మునగపాక: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చూచుకొండలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ సాధ్యం



పెదరాంభద్రపురంలో క్యాన్సర్‌పై అవగాహన కోసం కరపత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పెదరాంభద్రపురం పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌పీవీ రెండో డోస్ ఇస్తున్న రఘునాథరావు

పాయకరావుపేట: అవగాహనతోనే హెచ్‌పీవీ క్యాన్సర్‌ను నివారించవచ్చునని ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.రఘునాథరావు తెలిపారు. పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవసేవ, దిగుమర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హెచ్‌పీవీ రెండో డోస్ క్యాన్సర్ నిరోధక టీకాలను వేశారు. ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.రఘునాథరావు, డాక్టర్ లీల దిగుమర్తి సుమారు 200 మంది విద్యార్థులకు ఉచితంగా టీకాలు వేశారు. కేవలం అవగాహనతో, ముందస్తు టీకాలతో పిల్లలకు భవిష్యతులో గర్భాశయ, సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించవచ్చునని అన్నారు. ఈ ఏడాది మార్చి నెలలో మొదటి డోస్ టీకాలు వేయగా, ఇప్పుడు రెండో డోస్ వేశారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. కలుషిత ఆహారం, రసాయనాలతో పండించిన పంటలు, మానసిక ఒత్తిడి వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని డాక్టర్ మానస హెచ్చరించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించినా, అనుమానం ఉన్నా ఎంఎల్‌హెచ్‌పీ ఆరోగ్య కార్యకర్తల సహకారంతో పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రజల్లో అవగాహన కలిగించడం ద్వారానే క్యాన్సర్‌ను అదుపులోకి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, సునీత, ఉమా మహేశ్, శోభ, ఇందిర, గణేశ్, ముకేశ్, నాగేశ్వరరావు, వరలక్ష్మి, స్వాతి, దేవుడమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



హరిపాలెంలో పీహెచ్‌సీ వద్ద క్యాన్సర్‌పై అవగాహన ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

ఆయిల్‌పామ్ రైతులకు రాయితీపై ఎరువులు



పి.కె.గూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖాధికారి ఎస్.శిరీష

నాతవరం : ఆయిల్‌పామ్ తోటలు పెంచే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవనశాఖాధికారి ఎస్.శిరీష అన్నారు. మండలంలో గురువారం పి.కె.గూడెం నాతవరం గ్రామ పంచాయతీల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ద్వారా రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు, ఎరువులు అందిస్తున్నామని, అంతర పంటలు సాగు చేసేందుకు నాలుగేళ్ల పాటు 50 శాతం రాయితీ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అదే విధంగా ఆర్‌కేవీవై పథకం ద్వారా జీడి మామిడి, జామ, బొప్పాయి కోకో కొబ్బరి తోటలను కొత్తగా వేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తుందన్నారు. తర్వాత జీడిమామిడి తోటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నామని, ఈనెల 15తేదీ లోపు బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీకే గూడెం సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు, పతంజలి కంపెనీ మేనేజరు చంద్రశేఖర్ సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంటు శివాజీ పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు రోగుల తరలింపు



శస్త్ర చికిత్సల నిమిత్తం వెళుతున్న రోగులు

యలమంచిలి రూరల్: ఇటీవల యలమంచిలి పాత సినిమా హాలు వద్ద ఏబీ చారిటబుల్ ట్రస్టు, మరిడి మహాలక్ష్మి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన పలువురు రోగులను గురువారం ఆస్పత్రికి తరలించారు. వారందరికీ ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్టు నిర్వాహకులు స్థానిక విలేకరులకు తెలిపారు. వైద్య పరీక్షల్లో వైద్యుల సూచనల మేరకు శస్త్ర చికిత్సల కోసం పట్టణానికి చెందిన పులువురు రోగులను గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో తగరపువలసలోని అనిల్ నీరుకొండ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వారందరికీ శస్త్ర చికిత్సల అనంతరం పూర్తిగా కోలుకున్న తర్వాత మళ్లీ ఇళ్లకు పంపిస్తామని, అప్పటి వరకు పూర్తి ఖర్చులు తాము భరిస్తామని ఏబీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శాంతి స్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగబిల్లి మరిడిమహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తొట్టా నాగశ్రీనివాసు, నక్కా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలోని డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో ఈ నెల 10న జిల్లా స్థాయి స్విమింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరయ్య, సీహెచ్ దేముడులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9573690954 ఫోన్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

104 సిబ్బందికి జీతాలు చెల్లించండి



కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగదివ్యకు వినతి పత్రం అందజేస్తున్న కింతలి 104 సిబ్బంది

మాడుగుల రూరల్ : ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్న 104 సంచార వాహన సిబ్బందికి మూడు మాసాలుగా జీతాలు ఇవ్వక పోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని కింతలి పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న 104 సిబ్బంది గురువారం స్థానిక వైద్యాధికారి నాగదివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సంచార వాహనాలు గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 మాసాలు జీతాలు వెంటనే చెల్లించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో నెంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ కింతలి పీహెచ్‌సీ పరిధిలో 104 సంచార వాహనం డేటా ఎంట్రీ ఆపరేటర్ ముమ్మిన గంగాధర్, డ్రైవరు ఎస్. భార్గవ్‌లు వినతిపత్రం అందజేశారు.

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



కోటవురట్లలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కోటవురట్ల: మండల కేంద్రంలో మినీ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ స్థలంలోని ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. ఆర్అండ్‌బీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు బడ్డీలు ఏర్పాటు చేసుకుని కొంతకాలంగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ బడ్డీలకు వెనుక కొండ పోరంబోకుకు చెందిన గెడ్డ కాలువ ఉండగా.. కాలువను అనుకుని కొంత ఆర్అండ్‌బీ స్థలం ఉంది. ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించుకుని ఓ వ్యక్తి ఇంటిని నిర్మించుకున్నారు. అయితే కొంత కాలంగా ఇంటి యజమానికి, బడ్డీ కొట్టు వ్యాపారికి వివాదం నడుస్తోంది. దాంతో ఇరువురు రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఆక్రమణలపై పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. మరికొంచెం ముందుకెళ్లి ఇరువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో న్యాయస్థానం తీర్పునిస్తూ ఆర్అండ్‌బీ స్థలం సర్వే నంబరు 192లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న బడ్డీలతో పాటు ఇంటిలో కొంత భాగాన్ని ఇరు శాఖల అధికారులు ఎస్ఐ రమేష్ సారథ్యంలో తొలగించారు.

శిథిల మంచినీటి పథకం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం శివారు పురుషోత్తపురంలోని రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు గురైంది. పథకం అడుగు భాగం పెచ్చులూడిపోయింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 6న అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో భాగంగా శిథిలావస్థలో మంచినీటి పథకం పేరిట ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస స్పందించారు. గురువారం గ్రామానికి చేరుకొని ట్యాంకును పరిశీలించారు. గ్రామానికి అవసరమయ్యే రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అలాగే ప్రస్తుత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పురుషోత్తపురంలోని శిథిల రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి

మునగపాక: రైతులు పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రైతులకు పంటల బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి మినుములకు ఎకరాకు రూ.300, పెసలు ఎకరాకు రూ.300, వరికి ఎకరాకు రూ.630 వంతున ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, రైతు సంఘ అధ్యక్షులు ఆడారి మహేష్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కిన వీవోఏలు



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీవోఏలు



నక్కపల్లి వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీవోఏలు

కోటవురట్ల: వెలుగు వీవోఏలు తమ డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కారు. న్యాయపరమైన తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం బైఠాయించి ఆందోళన చేశారు. అక్కడి నుంచి ప్రధాన కూడలి మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏపీఎం రమణకుమారికి, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు, తహసీల్దారు తిరుమలబాబుకు వినతిపత్రాలు అందజేశారు. వీవోఏ మండల యూనియన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే తమపై కత్తి కట్టిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి మూడేళ్ల కాలపరిమితి పూర్తికాగానే వీవోఏలను తొలగించవచ్చనే విధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా వేతనాలు ఇవ్వకుండా ఐదు నెలలకు ఇస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే బీమా వంటి ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నక్కపల్లి: తమ వేతన బకాయిలు చెల్లించాలంటూ పేదరిక నిర్మూలన స్థంలో పని చేస్తున్న వీవోఏలు గురువారం నక్కపల్లి వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తమకు అయిదు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల కాలపరిమితి జీవోను రద్దు చేయాలన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. రాజకీయ వేధింపుల నుంచి కాపాడాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహిళా మార్టులలో అమ్మకాలు కొనుగోలుపై టార్గెట్లను తొలగించాలన్నారు. ఈ ఆందోళనలో వీవోఏలు సూర్యనారాయణ, నాగమణి, తులసి, తదితరులు పాల్గొన్నారు.

26వ రోజుకు అభిజిత్ కార్మికుల నిరసన



అభిజిత్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ పరిశ్రమను వెంటనే పునః ప్రారంభించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం నిరసన తెలిపారు. 26 రోజులుగా ఆందోళన చేస్తున్నా కంపెనీ లే ఆఫ్ ఎత్తివేయడం లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల బకాయిలు చెల్లించి కంపెనీ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జి.కోటేశ్వరరావు, రాము, సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులతో రీసర్వే లోపాల సవరణ



మాట్లాడుతున్న రీ-సర్వే డీటీ పడాల్

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డీటీ పడాల్ కోరారు. మండలంలోని రాజుపేట సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆయన 14 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలోని లోపాలను సవరించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిలాడి దేముడు, రైతులు కర్రి రాము, దుబాసి నాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ పనులకు భూమి పూజ



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హెచ్ఎం బంగారయ్య, తదితరులు

ఎస్.రాయవరం: వాకపాడు పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు గురువారం ప్రధానోపాధ్యాయుడు తోట బంగారయ్య స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. చాలా ఏళ్లుగా పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని హెచ్ఎం తెలిపారు. ఎట్టకేలకు ప్రహరీ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ దండా త్రిమూర్తులు, నాయకులు తుమ్మపాల నాగేశ్వరరావు, కాలపురెడ్డి రమణ, బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట: పాయకరావుపేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలోని 11కేవీ పాయకరావుపేట ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికివేతలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. రాజుగారి బీడు, మన్నా పబ్లిక్‌స్కూల్, కంటోన్మెంట్, మంగవరం రోడ్డు, తానా వారి వీధి, ముస్లిం వీధి, చాకలిపేట, నాగరాజుపేట, మెయిన్‌రోడ్డు, పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ ఉండదని ఆ శాఖ ఏఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణ పనుల కారణంగా పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. కొత్త ఎర్రవరం, లైను కొత్తూరు, సోమన్నపాలెం, కట్టుపాలెం, కొత్తపాలెం, సోమలింగపాలెం, రామారాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పూడిమడక పరిసరాల్లో నీటి శాంపిల్స్ సేకరణ



పూడిపూడక పరిధిలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్ పరిధిలోని పూడిమడకకు ఆనుకొని పలు కంపెనీల నుంచి వచ్చే నీటి శాంపిల్స్‌ను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, మత్స్యశాఖ అధికారులు గురువారం సేకరించారు. పూడిమడకకు చెందిన చేపల తాతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారు పూడిమడక పరిసరాల్లో పర్యటించారు. నీటి శాంపిల్స్ ఫలితాలను కలెక్టర్‌కు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు ప్రసాద్, జాస్మిన్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.